క్లుప్తంగా

ఆరో రోజుకు చేరిన సమ్మె



గౌరీపట్నంలో సమ్మె చేస్తున్న క్వారీ పొక్లెయిన్ ఆపరేటర్లు

దేవరపల్లి: నూతన వేతన ఒప్పందం కోసం దేవరపల్లి, కొవ్వూరు మండలాల్లోని క్వారీల్లో పొక్లెయిన్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం ఆరో రోజుకు చేరుకుంది. సుమారు 220 మంది ఆపరేటర్లు సమ్మె చేస్తున్నారు. ఐదు రోజులుగా క్వారీల్లోని పొక్లెయిన్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ ప్రభావం క్వారీ పరిశ్రమపై పడింది. గత వేతన ఒప్పందం ఏప్రిల్ 22 నాటికి ముగియడంతో, మూడేళ్ల కాల పరిమితికి నూతన ఒప్పందం చేయాలని కార్మికులు యజమానులను డిమాండ్ చేస్తున్నారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆపరేటర్లు సమ్మె చేపట్టారు. గౌరీపట్నం శివారు కొండగూడెం వద్ద కార్మికులు సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా నాగరాజు



తాళ్లపూడి: కొత్తగా యూనియన్ బ్యాంక్ తాళ్లపూడి బ్రాంచి మేనేజర్‌గా వి.నాగరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన ఇంద్రజిత్ బదిలీ అయ్యారు. ఏలూరు వద్ద ముండూర్ బ్రాంచి నుంచి నాగరాజు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఏపీ పాలిసెట్‌లో ఎలైట్ విద్యార్థికి 109వ ర్యాంక్



కొండాబత్తుల కౌశిక్

నల్లజర్ల: ఏపీలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్–2025) ఫలితాల్లో దూబచర్ల ఎలైట్ స్కూల్ విద్యార్థి కొండాబత్తుల కౌశిక్ రాష్ట్ర స్థాయి 109వ ర్యాంకు సాధించినట్టు ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం సాయంత్రం కౌశిక్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు, డైరెక్టర్లు సుదర్శనం, సుబ్బారావు అభినందించారు.

కాలువలోకి జారిపడి వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: మండలంలోని తాళ్లపాలెం వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్సై జగన్మోహన్‌రావు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరుకు చెందిన బొర్రా నాగరాజు (41) కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం తాళ్లపాలెం కాలువ గట్టు వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలువలోకి జారి పడి మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వివాదాస్పద స్థల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న కమిషన్ సభ్యురాలు విజయభారతి

తాళ్లపూడి: మండలంలో వివాదాస్పద స్థల పరిశీలనకు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి ప్రక్కిలంక గ్రామానికి బుధవారం విచ్చేశారు. ప్రక్కిలంకలో నెలకొన్న సూర్యదేవాలయం నిర్మాణ స్థలానికి సంబంధించిన వివాదంపై ఆమె వివరాలు సేకరించారు. వివాద స్థలాన్ని పరిశీలించి, అనంతరం అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం ఆలయానికి ఇబ్బంది లేకుండా వేరే స్థలం ఏర్పాటు చేయాలని అధికారులకు నిర్దేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఆలయం నిర్మాణం చేస్తున్న యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావుతో మాట్లాడారు. ఆమె వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన భారతి, ఆర్ఐ కె.రామకృష్ణ, వీఆర్వోలు ఉన్నారు.

ఏదీ ముద్ర..?

- పశువైద్యుల సర్టిఫై లేకుండా జీవాల వధ
- నిబంధనలను విస్మరిస్తున్న వ్యాపారులు
- విక్రయాల్లో ప్రమాణాలు పాటించని వైనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



నిడదవోలు: కొనుగోలు చేస్తున్న మాంసం నాణ్యమైనదా, కాదా గుర్తించలేని వారు చాలామంది ఉన్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు వ్యాపారులు కొనుగోలుదారులను బురిడీ కొట్టిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, నిర్ణీత ప్రమాణాలు పాటించకుండా, నాణ్యత లేని మాంసం అంటగడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో మున్సిపల్ లైసెన్స్ పొందిన పొట్టేలు మాంసం దుకాణాలు నాలుగు ఉండగా, అనుమతి లేనివి పదికి పైగా ఉన్నాయి. దుకాణాల్లో మామూలు రోజుల్లో రెండు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు మాంసం విక్రయాలు ఉంటాయి. ఆది, మంగళవారాల్లో అంతకుమించి భారీగా విక్రయిస్తున్నారు. కిలో పొట్టేలు మాంసం రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు పలుకుతోంది.

పశువైద్యాధికారి ముద్ర లేకుండా..

నిబంధనల ప్రకారం మున్సిపల్ శానిటరీ, పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కలిసి పశు వధశాలలో అనుమతిచ్చిన దుకాణాలకు మాంసం పరిశీలన చేయాల్సిందిగా పశు వైద్యాధికారులకు నోటీసులు ఇస్తారు. పశు వైద్యాధికారి పరిశీలన చేసి, ఆరోగ్యకరమైన జీవాలు అని ధ్రువీకరించిన తర్వాతే వాటిని వధించాలి. మాంసం శుభ్రం చేసిన తర్వాత కూడా వైద్యులు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, అది సురక్షితమైనది అని ముద్ర వేశాకే దుకాణాల్లో విక్రయించాలి. మాసం విక్రయించేటప్పుడు ఈగలు, దోమలు వాలకుండా తెరకప్పి ఉంచాలి. పట్టణంలో ఈ విధానాన్ని వ్యాపారులు పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పశు వైద్యాధికారులు ధ్రువీకరణ ముద్ర లేకుండానే జోరుగా విక్రయాలు చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. పట్టణ శివారున కబేళా లేకపోవడంతో వ్యాపారులు జీవాలను తమ ఇళ్లు, దుకాణాల వద్ద వధిస్తున్నా.. మున్సిపల్ అధికారులు మాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యాపారులు తూకాల్లో కూడా మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరికొందరు మిగిలిన మాంసాన్ని ఫ్రీజర్లలో నిల్వ ఉంచి, కొనుగోలుదారులకు విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది.

కానరాని పరిశుభ్రత

గతంలో పట్టణ శివారున కంపోస్టు యార్డులో కబేళా ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో తొలగించారు. దీంతో వ్యాపారులు ఇళ్లు, దుకాణాలు, బహిరంగ ప్రదేశాల్లో జీవాలను వధిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు చేస్తుండడంతో దుమ్ము, ధూళితో మాంసం కలుషితమవుతోంది. దీనిని వండుకుని తిన్నవారు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. మాంసం కోసేందుకు ఉపయోగించే కత్తులు, ఇతర పాత్రలు నిత్యం వేడి నీటితో కడిగి, శుభ్రంగా ఉంచాలి. దుకాణాలు ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్‌తో క్రమం తప్పకుండా శుభ్రపర్చాలి. వ్యాపారులు ఆరోగ్యంగా ఉంటూ, పరిశుభ్రతను పాటించాలి. జీవాలను వధించే సమయంలోనే పశువైద్యులు, మున్సిపల్ అధికారులు ఇవన్నీ పరిశీలించాలి. ఇవేమీ అమలవుతున్న దాఖలాలు కానరావడం లేదు.

తాజా మాంసం గుర్తించడమెలా!

జీవాల మాంసం తాజాదైతే లేత పసుపు, లేత తెలుపు, పింక్ కలర్‌లో ఉంటుంది. కల్తీ, నిల్వ ఉంచిన, చెడిపోయిన మాంసం ముదురు ఎరుపు రంగులో ఉంటుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. ఆ మేరకు మాంసాహార ప్రియులు అన్నీ పరిశీలించి కొనుగోలు చేయాలని వారు సూచిస్తున్నారు.

సమాచారం ఇవ్వడం లేదు

ప్రతి జీవాలను పరిశీలించిన తర్వాత ఆరోగ్యకరమైనవి అని నిర్ధారించిన తర్వాత ముద్ర వేస్తాం, మున్సిపల్ అధికారులు మమ్మల్ని సంప్రదించడం లేదు. పొట్టేలు, మేకలను వధించేటప్పుడు పరిశీలించాల్సిందిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్, పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కలిసి మాకు చెబితే, వెంటనే వాటిని పరిశీలించి నిర్ధారించడానికి అవకాశం ఉంటుంది. తర్వాత వాటిని వధించడానికి అనుమతిస్తాం. ఆరోగ్యకరమైన జీవాలకు ముద్ర వేసిన తర్వాతే దుకాణాల్లో విక్రయించాలి.

– ఏవీ రుషిప్రసాద్, ఏడీ, పశు సంవర్ధక శాఖ, నిడదవోలు

హుండీ ఆదాయం రూ.7.31 లక్షలు



అన్నవరప్పాడులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సభ్యులు

పెరవలి: అన్నవరప్పాడులో ఉన్న వేంకటేశ్వరస్వామి హుండీని బుధవారం అధికారులు, గ్రామ పెద్దల సహకారంతో లెక్కించినట్టు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ప్రధాన హుండీతో పాటు, ఉపాలయాల హుండీల ద్వారా రూ.7,14,380 ఆదాయం వచ్చిందని చెప్పారు. అన్నదాన హుండీ ద్వారా రూ.16,903తో కలిపి 69 రోజులకు మొత్తం రూ.7,31,283 వచ్చిందని తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. గ్రామ పెద్దలు, దాతల సహకారంతో ప్రతి శనివారం ఉచిత అన్న సమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి ఎంవీ రామయ్య సమక్షంలో గ్రామ పెద్దలు పప్పొప్పు నాగేశ్వరరావు, పంతం నాగేశ్వరరావు, రంగనీటి కట్లయ్య, ఓసూరి బాలనాగేశ్వరరావు, బొలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 77,196 టన్నుల ఇసుక నిల్వ

- ఆర్డీవో రాణి సుస్మిత



పురుషోత్తపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

నిడదవోలు రూరల్: రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కొవ్వూరు డివిజన్ పరిధిలోని స్టాక్ పాయింట్లలో ప్రస్తుతం 77,196 టన్నుల ఇసుక నిల్వ చేసినట్లు ఆర్డీఓ రాణి సుస్మిత తెలిపారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రాణి సుస్మిత మాట్లాడుతూ గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లను గుర్తించడంతో పాటు, వర్షాకాలంలో ప్రభుత్వ, ఇతర నిర్మాణ పనులకు ఇసుక అందుబాటులో ఉండేలా లక్ష్యాలను నిర్దేశించామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక నిల్వలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మార్గదర్శకాలు అనుసరించాలి

నిడదవోలు: రైతుల నుంచి నేరుగా మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఉండాలని ఆర్డీవో రాణి సుస్మిత స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిడదవోలు పరిధిలోని మిల్లర్ల ప్రతినిధులతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్లో జిల్లాకు 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని నిర్దేశించినట్టు చెప్పారు. ప్రతి సీజన్‌లో రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. ఆ సమయంలో విధిగా బి–రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ధాన్యం వివరాలు ఏ–రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కోసం రైతులను ఇబ్బందులు పెట్టరాదని ఆదేశించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లో నగదు జమ చేయడంతో, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధిక లావాదేవీలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల ఇన్‌చార్జి అధికారి ఎంఆర్ఆర్ ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, మిల్లర్ల సంఘ మండల అధ్యక్షుడు ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే పరిశీలన

ఉండ్రాజవరం: గ్రామాల్లో జరుగుతున్న భూసర్వేకు రైతులు సహకరించాలని ఆర్డీవో రాణిసుస్మిత అన్నారు. మండలంలో వెలగదుర్రు, సత్యవాడ, వడ్లూరు గ్రామాల్లో భూ సమస్యలపై రికార్డులను ఆర్డీవో బుధవారం పరిశీలించారు. మండలంలో ధాన్యం కొనుగోలు తీరుపై తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యారావుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

గ్రామ స్థాయిలో కలసికట్టుగా పనిచేయాలి



దొమ్మేరులో కేక్ కట్ చేస్తున్న తలారి వెంకట్రావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



వెంకటేష్ కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు

తాళ్లపూడి (కొవ్వూరు): పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ స్థాయిలో కలసికట్టుగా, చిత్తశుద్ధితో పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దొమ్మేరు, ఆరికిరేవుల, పెనకనమెట్ట సావరం గ్రామాల్లో బుధవారం పార్టీ గ్రామ కమిటీల ఎంపికకు నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించారు. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కమిటీలను నియమించినట్టు చెప్పారు. పార్టీ కార్యక్రమాల్లో క్షేత్ర స్థాయి వారు చురుగ్గా పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ కొవ్వూరు మండల కన్వీనర్ వెంపాటి సురేష్, నాయకులు ముదునూరి నాగరాజు, బండి అబ్బులు, తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇలాఉండగా, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 21 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దొమ్మేరులో తలారి వెంకట్రావు నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు.

వివాహ వేడుకలో..

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తలారి వెంకట్రావు బుధవారం కొవ్వూరుకు చెందిన పార్టీ నాయకుడు నేతల వెంకటేష్ కుమారుడు స్వామి వివాహ వేడుకలో పాల్గొన్నారు. వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, మున్సిపల్ కౌన్సిలర్లు అక్షయపాత్ర రవీంద్ర, బత్తి నాగరాజు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ కొవ్వూరు డివిజన్ తరలించరాదు

- ఏపీజీఈఏ డిమాండ్



కొవ్వూరులో ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు ఆర్అండ్‌బీ డివిజన్‌ను వేరే ప్రాంతానికి తరలించే యత్నాలను ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) తీవ్రంగా వ్యతిరేకిస్తోందని సంఘ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ స్పష్టం చేశారు. కొవ్వూరు తాలూకా కార్యాలయం ఆవరణలో బుధవారం కొవ్వూరు యూనిట్ ఏపీజీఈఏ నాయకుల సమావేశం జరిగింది. కొవ్వూరు యూనిట్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆర్అండ్‌బీ డివిజన్‌ను తరలించరాదంటూ కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్‌వర్మ మాట్లాడుతూ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 2003లో ఏర్పాటైన ఈ డివిజన్ రాష్ట్రంలోనే పేరు పొందిందన్నారు. దీనిని తరలించడం అభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని చెప్పారు. తక్షణమే ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కొవ్వూరు, పరిసర ప్రాంతాలు పోలవరం ప్రాజెక్ట్ పరిధిలో ఉండటమే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంగా మారబోతున్నాయని తెలిపారు. ఇటువంటి కీలకమైన సమయంలో ఆర్అండ్‌బీ కార్యాలయం తరలింపు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. జిల్లా సహ అధ్యక్షుడు డీఎస్ చంబర్లీన్ మాట్లాడుతూ, జూన్ 5న విజయవాడలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ సుందర్, కొవ్వూరు యూనిట్ నాయకులు అనిల్, శ్రీనివాసరాజు, అనిత, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నిడదవోలు: పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దప్పళంపాడు గ్రామంలో దళితులను సామాజిక బహిష్కరణ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అర్ధరాత్రి ఈలలు వేశారని మాదిగ యువకులపై టీడీపీకి చెందిన పెత్తందారులు దాడి చేశారన్నారు. ప్రశ్నించిన వారిపై మంచినీరు, పాలు లభించకుండా ఆంక్షలు విధించటం దారుణమని నాయకులు జువ్వల రాంబాబు మండిపడ్డారు.

కోకో రైతులు తరలిరావాలి

నిడదవోలు రూరల్: కోకో రైతుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉదయం 10 గంటలకు ఏలూరులోని సోమవరప్పాడు జాతీయ రహదారిపై జరిగే భారీ ధర్నా కార్యక్రమానికి రైతులంతా తరలిరావాలని కోకో రైతు సంఘం నాయకులు ఉప్పల కాశీ పిలుపునిచ్చారు. మండలంలోని కోరుమామిడిలో కోకో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కోకో గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ జరిగే నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున కోకో రైతులు తరలిరావాలని కోరారు.

సంక్షిప్తంగా..

చిత్తశుద్ధితో చెత్త సేకరణ చేయాలి

ఉండ్రాజవరం: చిత్తశుద్ధితో చెత్త సేకరణ చేయాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో వి.రామారావు ఆదేశించారు. పాలంగి గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ బొక్క శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్ జానీ తదితరులు ఉన్నారు.

ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు

దేవరపల్లి: స్వయం ఉపాధి రుణాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌తో పాటు, వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి శుక్ర, శనివారాల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 పంచాయతీల్లో 59 యూనిట్లకు 293 మంది దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. 16న ఉదయం 10 గంటలకు దేవరపల్లి, 11కు పల్లంట్ల, 12కు సంగాయగూడెం, 12.30కు త్యాజంపూడి, ఒంటి గంటకు యాదవోలు, 2కు యర్నగూడెం గ్రామాల వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 17న ఉదయం 10కి కురుకూరు, కృష్ణంపాలెం, 10.30కు ధుమంతునిగూడెం, 11కు దుద్దుకూరు, 12కు గౌరీపట్నం, 12.30కు చిన్నాయగూడెం, ఒంటి గంటకు బందపురం, 2 గంటలకు దేవరపల్లి గ్రామాల వారికి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

పెరవలి: గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, వీటిని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రిసోర్స్ పర్సన్ ఎస్ పుష్పావతి అన్నారు. ముక్కామల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా బుధవారం ఇంగ్లిష్, యోగాపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. గ్రంథాలయాధికారి యు.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అదనంగా ధాన్యం కొనుగోలు

నిడదవోలు: నియోజకవర్గంలో మరో 8,025 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నిడదవోలు, పెరవలి మండలాల్లో వెయ్యి మెట్రిక్ టన్నుల వంతున, ఉండ్రాజవరంలో 6,025 మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం కొనుగోలుకు ఆదేశించినట్లు చెప్పారు.

రైస్‌మిల్లర్లు సహకరించాలి

ఉండ్రాజవరం: ధాన్యం కొనుగోలులో ప్రభుత్వానికి, రైతులకు రైస్‌మిల్లర్లు సహకరించాలని ఇన్‌చార్జ్ డీఎస్‌వో ఎం.రాజారమేష్ ప్రేమ్‌కుమార్ కోరారు. ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయంలో ఉండ్రాజవరం, పెరవలి మండలాల రైస్‌మిల్లు యజమానులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలుపై అధికారులు, మిల్లర్ల నుంచి వివరాలు సేకరించారు. తహసీల్దార్ పీఎన్‌డీ.ప్రసాద్, ఏవో విశ్వాసరావు, పౌరసరఫరాల డీటీ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారుల కోసం ప్రత్యేక మేళాలు

చాగల్లు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ కొవ్వూరు సీడీపీఓ డి.మమ్మీ అన్నారు. మండలంలోని 67,68,69,70 కేంద్రాల్లోని చిన్నారులతో బుధవారం ప్రత్యేక మేళా నిర్వహించారు. సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి హాజరయ్యారు. ప్రీస్కూల్ పిల్లలను సమీప పాఠశాలలకు ప్రమోట్ చేయడం మంచిదన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

నిడదవోలు: తెలంగాణలో గురువారం నుంచి ఈ నెల 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాలకు ఆర్టీసీ నిడదవోలు డిపో నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. మూడు రోజుల సరస్వతీ ధామం పుష్కర యాత్రలో భాగంగా బాసర, ధర్మపురి, కాళేశ్వరం, కొండగట్టు, వరంగల్, రామప్ప ఆలయ ప్రాంతాలను సందర్శిస్తారని వివరించారు. కాళేశ్వరంలో పుష్కర స్నానం అనంతరం తిరిగి నిడదవోలు చేరుకుంటారన్నారు. ఈ యాత్రకు టికెట్ ధర రూ.3 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

క్వారీ క్రషర్ల సంఘ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న యజమానులు

దేవరపల్లి: ది వెస్ట్ గోదావరి క్వారీ క్రషర్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం స్థానిక కాకర్ల కల్యాణ మండపంలో జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో మూడేళ్ల కాల పరిమితితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ఆండ్రు అనీల్(గౌరీపట్నం), గౌరవాధ్యక్షుడిగా పాట్రు సోమేశ్వరరావు(ఐ పంగిడి), ఉపాధ్యక్షుడిగా ముదునూరి సూర్యనారాయణరాజు(దొమ్మేరు), ప్రధాన కార్యదర్శిగా దోనెల్లి మధుబాబు(దేవరపల్లి), కార్యదర్శిగా పేపకాయల సత్యనారాయణ, కోశాధికారిగా కోట్ల కనకేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు మధుబాబు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

దేవరపల్లి: గౌరీపట్నం పంచాయతీ పరిధిలోని కొండగూడెం పీహెచ్‌సీ ప్రాంతంలో గురువారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా గ్రామంలో కొత్తగా విద్యుత్ లైన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు జరుగుతున్నందున దేచర్లలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గౌరీపట్నం రూరల్ ఫీడరులో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు వివరించారు. కొండగూడెం, నేషనల్ హైవే నుంచి జీఎస్‌టీ రోడ్డు మధ్యలో సాయిబాబా గుడి ప్రాంతం, పీహెచ్‌సీ ప్రాంతంలోని గృహ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ

నిడదవోలు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో దాతలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం అంబేడ్కర్ కళావేదిక వద్ద హైదరాబాద్ గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెయింట్ దేవదాసు అయ్యగారి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయంతో ఉచిత మెగా వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి ప్రారంభించారు. ఉచిత వైద్య సేవలతో పాటు, కేన్సర్ ముందు జాగ్రత్తలకు సంబంధించి 327 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేశాబత్తుల నాగప్రసాద్, వడల అంబేడ్కర్, నిర్వాహకులు పుచ్చకాయల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై రేపు నాటక ప్రదర్శన

నిడదవోలు: సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు జువ్వల రాంబాబు తెలిపారు. పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో జరిగే ఈ నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.